# అనగనగా ఒక ప్రేమ కథ

మొదటిసారి కంప్యూటర్ క్లాసులో ఆమెను చూడగానే ఎక్కడో చూసి నట్టనిపించింది. ఆమె చెపుతున్న పాఠం వినకుండా ఆమెనే చూస్తూ కూర్చున్నాను. కాసేపటికి నేను చేస్తున్నదేమిటో ఆమెకు అర్థమయింది. కోప్పడుతుందనుకున్నాను. నవ్వేసి ఊరుకుంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులకు పాఠాలు చెప్పే మాస్టార్లు కంప్యూటర్ల నించి తప్పించుకోలేకపోతున్నారు. అలా నన్నూ యూనివర్శిటీ వాళ్ళు కంప్యూటర్ క్లాసులకు తోలారు. ఫలితంగా మంజులతో స్నేహం. నేను క్లాసులకు లేటు కావడంతో నాకు ప్రత్యేకంగా ఆమె క్లాసులు తీసు కుంటోంది. అలా ఏకాంతంలో ఆమెతో మరింత స్నేహం పెరిగింది.

వారం తర్వాత, "ఇంత అందమైన ముఖానికి బొట్టు వుంటే ఎంత భావుంటుంది!" అన్నాను చనువు పెరగడంతో.

"మేం మతం పుచ్చుకున్నాం. బొట్టు పెట్టుకోము...." అంది.

ఆమె మాటలకు షాక్ కలిగినా నాకు సంతోషం వేసింది.

"మా చెల్లెలూ బొట్టు పెట్టుకోదు. మేమూ మతం పుచ్చుకున్నాం." అన్నాను.

"తెలుసు" అందామె క్లుప్తంగా.

"తెలుసా" ఆశ్చర్యపోయాను.

"ఔనండీ శ్యామ్‌గారు, మీరు మొదటిరోజు క్లాసుకు వచ్చినపుడే గుర్తు పట్టాను. మీ చెల్లాయీ. నేనూ మిషన్ హైస్కూల్లోనే కదా చదువు కున్నాం. కాలవ అవతలే కదా మీ ఇల్లు. రోజూ మీ చెల్లిని మీరు సైకిలు మీదే తీసుకొచ్చి దింపేవారు" అంది మంజుల.

అపుడు గుర్తొచ్చింది. ఈ అమ్మాయి కెనాల్ పేటలో వుండే శాంతయ్య కూతురని. వంతెన కింద ఎండలో చెమటలు కక్కుతూ చెప్పులు కుడుతూ నిరంరతం శ్రమపడే శాంతయ్య కూతురు మంజుల నేడు ఏసి గదిలో కంప్యూటర్ పాఠాలు చెప్పే టీచరు అనుకున్నాను. మంచి సామాజిక పరిణామం!'

“ఇప్పుడు మీ నాన్నగారేం చేస్తున్నారు?” అన్నాను.

“వంతెన క్రింద షాపు మూసేసారు. అన్నయ్య కువైట్ వెళ్ళాడు. నాన్న మెయిన్ రోడ్డులో జోళ్ళ షాపు తెరిచాడు. నేను డిగ్రీ తర్వాత కంప్యూటర్ కోర్సు చేసాను. కువైట్ వెళదామనుకున్నాను. అమ్మకు ఇష్టం లేదు. ఈ సెంటర్‌లో జాబ్ రావడంతో వైజాగ్ వచ్చాను. మావయ్య వాళ్ళ ఇంట్లో వుంటున్నాను.”

ఆమె మాటలకు ఆనందం కలిగింది. స్నేహం మరింత పెరిగిన కొన్ని రోజుల తర్వాత బాగా ఆలోచించి, “నన్ను పెళ్ళి చేసుకోవడం ఇష్టమేనా” అన్నాను.

“ముందు మా ఇంట్లో వాళ్ళను అడగండి” అంది మంజుల.

ఆ రోజే కాలేజికి సెలవు పెట్టి ఊరు ప్రయాణ మయ్యాను.

*  *  *

చాలా సంవత్సరాల తర్వాత కెనాల్ పేటలోకి అడుగు పెట్టాను. కెనాల్ పేటలో వచ్చిన మార్పులు చేశాక ఆశ్చర్యం వేసింది. చాలామంది కువైట్ వలస వెళ్ళిన తర్వాత ఇళ్ళన్నీ డాబాలుగా మేడలుగా రూపాంతరం చెందాయి. దళితవాడగా పిలవబడిన కెనాల్ పేట నేడు ధనికవాడ అయింది. హర్షించతగ్గ మార్పే.

మంజులను చిన్నతనంలో నేను చూసిన తాటాకుల ఇంటి స్థానంలో

రెండు అంతస్థుల బిల్డింగ్ వెలసింది. మంజుల తండ్రిగారు నన్ను సాదరంగా లోపలకు తీసు కెళ్ళారు. అరగంట వరకూ నా మనస్సులో మాట బయట పెట్టలేదు.

ఇక వచ్చేముందు చెప్పాను - “మంజులను పెళ్లి చేసుకుందామను కుంటున్నాను. మీ ఉద్దేశ్యం?” అంటూ ఆగాను.

“బాబూ నాకేమీ అభ్యంతరం లేదు. మీరు బాగా చదువుకున్నవారు. ముందు ఇంట్లో వాళ్ళను ఒప్పించండి. నేను మీరడిగినంత కట్నం ఇస్తాను”

“నేను కట్నాలు తీసుకోను” అన్నాను ఆవేశంగా.

ఆయన నవ్వుతూ, “నాకు ఒక్కతే కూతురు. నా కూతురుకు ఇవ్వాల్సింది ఇస్తా” అన్నాడు.

“అలాగే” అంటూ ఆయననించి శలవు తీసుకున్నాను.

ఇంటికొచ్చాను. నాన్నతో మంజులతో పెళ్ళి గురించిన విషయం ఎలా మాట్లాడాలా అనే మీమాంసలో వున్నాను. ఆ అవకాశం ఆయనే ఇచ్చాడు.

“ఒరేయ్ మన లాజరస్‌గారు, అదే బాంకులో మేనేజర్ మనకు దూరపు చుట్టరికం, వాళ్ళమ్మాయిని నీ కిద్దామనుకుంటున్నారు. ఆ అమ్మాయి బియస్సీ బియిడి. జిల్లా పరిషత్ స్కూల్లో పనిచేస్తోంది. వైజాగ్ బదిలీ చేయించు కోవచ్చు”

నాన్న చెప్పుకు పోతున్నాడు.

వెంటనే అన్నాను - “మంజుల అని ఈ ఊరమ్మాయి వైజాగ్‌లో పని చేస్తోంది. చాలా మంచి అమ్మాయి నాకు వచ్చింది. ఆమెను పెళ్ళి చేసుకుందామను కుంటున్నాను”

“ఎవరా అమ్మాయి?” అన్నాడు నాన్న ఆశ్చర్యంగా.

"కెనాల్ పేటలో వుండే శాంతయ్య కూతురు."

క్షణంలో ఆయన మొహం ఎర్రబడింది. ముక్కుపుటాలు అదిరాయి.

"ఏరా! నీకు ఆ వంతెన క్రింద చెప్పులు కుట్టే శాంతయ్య కూతురే దొరికిందా?" అన్నాడు నాన్న కోపంగా.

"ఇప్పుడు ఆ పని మానేశాడు. అయినా అది సిగ్గు పడాల్సిన పనా? ఇపుడు వాళ్ళబ్బాయి కువైట్ వెళ్ళాడు. వారి స్టేటస్ మారింది. నీకు కావాల్సింది అదేగా" అన్నాను కోపంగా.

"వాళ్ళెంత సంపాదించినా, మన వాళ్ళు కాదు" అన్నాడు నాన్న.

నా బుర్రలో విస్ఫోటనం.

"తప్పు నాన్నా నువ్ ఇలా మాట్లాడడం వాళ్ళదీ మనదీ ఒకటే కులం. 1935లో జారీచేసిన షెడ్యూల్‌లోని 439 కులాల జాబితాలో వాళ్ళదీ, మనదీ వుంది. మన మధ్యే ఇలాంటి అసమానతలుంటే సాంఘిక న్యాయం ఎలా వస్తుంది." అన్నాను గట్టిగా.

"ఒరేయ్ రెండు రెండే మూడు మూడే, రెండెప్పుడూ మూడు కాదు." అన్నాడు నాన్న ఇంకా గట్టిగా.

నా మెదడు కాసేపు పనిచెయ్యడం మానుకుంది.

నేను రెండు, మంజుల మూడు అంటే మేం కలవలేమా!

నాలో కొద్దిగా నైరాశ్యపు నీడలు. ఇంట్లోంచి బైటకు నడిచాను. దాసుగారు గుర్తు కొచ్చారు. ఆయన మా నాన్న స్నేహితుడు. మా వీధి చివరే వుంటున్నారు. నా బాధ ఆయనకు చెప్పుకుందామనిపించింది. ఇంట్లోకి నేను వెళ్ళేసరికి దాసుగారు పుస్తకం చదువుతూ కనిపించాడు. వెంటనే నేను గుర్రం జాషువాగారి కవిత ఆయనకు వినిపించాను.

"దేవుడొకడు మాకు దేవళములు రెండు
దేశమొకటి మాకు తెగలు రెండు
మాలక్రీస్తుని కన్న మాదిగ క్రీస్తుడే
యరవీసె గొప్పవాడనియె నొకడు.
మాల బోధకు డెన్నడో మాదిగింట
కుడిచినాడని యమ్మాలగూడెమునకు
నెడముగా నుంచి దాహంబు నీయరనుచు
గుసగుసలు గల్గునిది తేల్చుకొనుట లెస్స..."

నా కవిత విని ఆయన తలెత్తి చూసి, "బాబూ మీ నాన్న ఇప్పుడే ఫోన్ చేసి నీ ప్రేమ కథ గురించి చెప్పాడు. అవును ఇది ప్రేమ కథే. మన జాతి జనుల మధ్య విద్వేషం పోయి అందరం ప్రేమించుకోవాలంటే నీలాంటి వారి ప్రేమ కథలు విజయవంతం కావాలి! అన్నాడు.

"మరైతే ఎందుకండీ ఈ వైరుధ్యాలు.." అన్నారు ఆవేశంగా.

"అది మన తప్పు కాదు. మన మాల మాదిగల్ని అనాదిగా సమాజం ఉమ్మడి పేర్లతోనే పిలిచింది. వేదకాలంలో ఆర్యులనీ, పురాణాల యుగంలో అవర్ణులనీ, స్మృతులు ప్రాచుర్యంలోకి వచ్చే సమయంలో చండాలురనీ, మధ్యయుగంలో శ్వపచులనీ, స్వాతంత్ర్యకాలంలో హరిజనులనీ, నేటి ఆధునిక కాలంలో దళితులనీ... అయితే రాజకీయ లబ్ధి కోసం ఏర్పడిన ఉపకుల సంక్షోభం వచ్చేసరికి మన ఉమ్మడి పేర్లు మన పేర్ల చివర తగిలించుకునే స్థితికి చేరుకున్నాం. ఈ నేపథ్యంలో మన గుడి వీధికి, కెనాల్ పేట్‌కు సంఘర్షణలు తలెత్తాయి. నెల క్రితం గుడి వీధి కుర్రాడు కెనాల్ పేట అమ్మాయిని పెళ్ళిచేసుకునే సరికి తలలు సరుక్కునే వరకూ వెళ్ళేరు. ఇంకా ఆ గొడవ అలానే వుంది. అయినా తప్పదు. ఇలాంటివి జరగాలి. తప్పని సరి... నువ్ ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకో భయపడకు."

ఆయన చెప్పడం ముగించాడు. ధైర్యం చెప్పినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసి ఇంటికి బయలుదేరాను. ఇంటికి వెళ్ళేసరికి గుమ్మం ముందు నించుని ఏడుస్తూ అమ్మ ఎదురయ్యింది.

"బాబూ నాన్న చెప్పినట్టు వినరా! నాకేదో భయంగా ఉంది. కెనాల్ పేటకి మన వీధిలో వాళ్ళకీ పడడం లేదు." అంటూ ఏడ్చింది.

అమ్మ ఏడుపుతో దాసుగారిచ్చిన ధైర్యం నీరు కారింది. ఇక ఇంట్లో వుండలేక ఆ రోజే వైజాగ్‌కు తిరిగొచ్చాను.

*  *  *

డప్పుల చప్పుడుకి చెవులు రెండూ మూసుకున్నాను. దూరం నించీ వస్తున్న చప్పుడు క్రమేపీ దగ్గరయింది. వేలకొలదీ శబ్దాలు గుండెల మీద దబదబమని బాదుతున్నట్టు. మరణమృదంగ నాదం. 'తన్నండి' 'నరకండి' చంపండి' ఎన్నో గొంతుకలు చుట్టుముట్టాయి. కళ్ళు తెరిచే సరికి గడియారం ఐదు చూపిస్తోంది.

'మైగాడ్.. ఇది కలా! ఊళ్ళో సంగతులు గురించి ఆలోచిస్తుంటే వచ్చిందా ఈ కల!'

లేచి మంచినీళ్ళు తాగాను. పూర్తిగా తెల్లవారింది. వాతావరణం నిర్మలంగా, నిశ్శబ్దంగా ఉంది. కల తాలూకు కల్లోలం నుంచి బైటపడడానికి పచార్లు చేస్తున్నాను.

"సార్ పేపర్" అంటూ కేక వినిపించేసరికి తలుపు తీసి బైటకొచ్చాను. పేపరందుకుని చూస్తున్నాను. తిరగేస్తుంటే మధ్య పేజీలో చిరపరచితమైన ముఖం. ఆ ఫోటో నా ఆప్తమిత్రుడు శేషుది. గబగబా చదివాను.

అశృతాంజలి

పుణ్యమూర్తుల శేషు

జననం : 1.9.1970; మరణం : 20.5.2004; దశాహం : 30.5.2004 సపిండీకరణం : 1.6.2004

నీ ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ తండ్రి : దీక్షితులు; తల్లి : వెంకటలక్ష్మి; చెల్లెళ్ళు : గాయత్రి, అనూరాధ.

ఆ వార్త చదవగానే మనసు మనసులో లేదు. మెదడు మొద్దుబారింది. నా ప్రాణమిత్రుడు చనిపోయాడనే విషయం జీర్ణించుకోలేక పోతున్నాను. ఆరేళ్ళ క్రిందట అతడితో గడిపిన రోజులు గుర్తుకొచ్చాయి.

యూనివర్శిటీలో ఎమ్మే సీటొచ్చింది. హాస్టల్‌లో రూమ్ దొరకలేదు. ఒక చిన్న రూమ్ కోసం వెదుకులాట. రూముల యజమానుల యక్షప్రశ్నలు. కులం, గోత్రం అడిగారు. పూర్తిగా వినకుండానే ముఖం మీదే తలుపు మూసే వారు. కొంతమంది గుంభనంగా శాకాహారులకు మాత్రం ఇస్తాం అనేవారు. అసలే ఎండాకాలం. ఇళ్ళ వేటలో అలా తిరిగి తిరిగి ఒక ఇంటి మెట్టు మీద వాలిపోయాను ఎండకు తట్టుకోలేక. అలా ఎంత సేపు వుండిపోయానో తెలీదు. ముఖం మీద చల్లటి నీళ్ళు పడడంతో కళ్ళు తెరిచాను. ఎదురుగా చిరు దరహాసంతో ఒక వ్యక్తి. కొనదేరిన ముక్కు, నుదుటి మీద బొట్టు.

ఏం మాష్టారూ! ఇంతటి ఎండలో వనవిహారం పగలే వెన్నెలా, అనుకుంటూన్నారా'' అన్నాడు.

లేదండి అద్దె ఇంటి కోసం వెదుకుతున్నాను అంటూ నా ప్రయత్నాలు వివరించాను. నా కులం వల్లే నాకు ఇల్లు దొరక లేదనే విషయం మాత్రం చెప్పలేదు.

మీ కభ్యంతరం లేకపోతే నా రూములో సర్దుకుందాం. నేనూ యూనివర్సిటీలోనే చదువుతున్నాను. ఏమ్మెస్సీ ఫిజిక్స్ నా పేరు శేషు అన్నాడు.

నాకు ఆనందంతో ఎగిరి గంతేయాలని పించింది. వెంటనే ఒప్పేసు

కున్నాను. అలా అతడి రూమ్మేటుగా వైజాగులో నా జీవితం ప్రారంభమయ్యింది. చిన్న పల్లెటూరు నించి నగరానికొచ్చిన నాకు శేషు ఒక మార్గదర్శిలా సహాయపడ్డాడు. అతడితో స్నేహ జీవితం హాయిగా సాగేది.

ఒక రోజు పుస్తకాలు అలమారాలో సర్దుతుంటే కొన్ని కాగితాలు కనిపించాయి. చూస్తే అవి కవితలు. 'శేషుకి కవిత్వం వచ్చన్నమాట' అనుకుంటూ ఆ కాగితాలు తీసి చదవడం ప్రారంభించాను. ఇంతలో శేషు వచ్చాడు. నా చేతిలోని కాగితాలు చూసి నవ్వాడు.

"ఏదో ఆవేశం వచ్చినప్పుడు ఇలా రాస్తూ వుంటాను" అన్నాడు.

"దేని మీద నీ ఆవేశం" అన్నాను.

"సాహిత్యం ఇలా వర్గాలుగా, గుంపులుగా విడిపోవటమేమిటి? ఎవరి గురించి వాళ్ళే రాసుకుంటే హితేన హితం సాహిత్యం అవుతుందా, సార్వజనీనత సాధించగలమా...?" అన్నాడు.

అతడి ప్రశ్నకు సమాధానం నా దగ్గరుంది.

సాహిత్యంలోని వాదాలు సమాజంలోని వివిధ జీవితాల వైరుధ్యానికి అద్దం పడతాయనీ, దళిత వాదం వర్ణ సంస్కృతి మీద, స్త్రీ వాదం లింగ వివక్ష మీద పోరాటం సాగిస్తోందనీ చెప్పలేకపోయాను. నా గురించి నేనే రాసుకోవడం అంటే నా పీడనల గురించి నేనే రాసుకోవడం, జీవితాన్ని అనుభవించిన నేనే నా అనుభవం గురించి రాసుకుంటే సజీవంగా జీవిత స్పర్శ వుంటుంది అని చెప్పలేకపోయాను.

ఒక రోజు 'గతి తప్పిన పాట' అంటూ కవిత రాసుకొచ్చి నన్ను అభిప్రాయం అడిగాడు.

నేను మౌనంగా వుండిపోయాను. నన్ను తోబుట్టువులా చూసు

కుంటున్న అతడితో వాదన పెంచటం ఇష్టం లేకపోయింది. అయినా నాలో అంతర్మథనం అలాగే వుండి పోయేది.

పిజి పూర్తవగానే శేషు వైజాగ్ వదిలి హైదరాబాద్‌లో ఒక కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం రావడంతో వెళ్ళిపోయాడు.

శేషు నన్ను విడిచి వెళ్ళిన తర్వాత అంతవరకూ నాలో రేగిన అలజడి గురించి అతడికి ఉత్తరం రాసేను. అప్పటికి గానీ నా మనసు శాంతించలేదు. నా ఉత్తరానికి శేషు నించి సమాధానం లేదు. ఆ తర్వాత మా ఇద్దరి మధ్యా ఏ కమ్యూనికేషనూ లేదు.

మరి ఇన్నేళ్ళ తర్వాత ఈ రోజు పేపరులో అతడి మరణవార్త. నా కళ్ళల్లో నీళ్ళు. నా మనసులో బాధ సుళ్ళు తిరుగుతోంది. వారి ఊరు వెళ్ళాలంటే వైజాగు నించి రెండు గంటల ప్రయాణం. అతడి కుటుంబానికి ఈ విషాదంలో నా పలకరింపు కొంత ఊరట కలిగిస్తే అంతే చాలు. అలా అనుకుంటూ గబగబా రూముకు తాళం వేసి బస్టాండుకు బయలు దేరాను.

* * *

బస్సు దిగి శేషు ఇంటి వైపు నడక సాగించాను. వారిని ఎలా పలకరించాలా అనే బెంగతో అడుగులు తడబడుతున్నాయి. శేషు ఇంటి చుట్టూ ప్రహరీగోడ. లోపల ఒక పాతకాలపు పెంకుటిల్లు. లోపల తులసికోట. కోట చుట్టూ పూలమొక్కలు. వేగంగా ఇంట్లోకి నడిచాను. ఎదురుగా గుమ్మం ముందు నువ్వు ముఖంతో వున్న శేషు ఫోటో నా దుఃఖం అధికం చేస్తూ అతడి ఫోటోకు దండ వేళ్ళాడుతోంది.

నేను అరుగు మీద కూలబడ్డాను.

''రా, నాయనా!'' అంటూ శేషు తండ్రి గారు నన్ను లోపలకు తీసుకెళ్ళారు.

"చాలా ఘోరం జరిగిపోయింది. నా మిత్రుడు శేషు" అంటూ ఏడ్చేసాను.

ఆయన శిలా ప్రతిమలా కూర్చుండి పోయారు. గుమ్మం అవతల ఏడుపులు వినిపించాయి. శేషు చెల్లెళ్లు గాయత్రి, అనూరాధ ఏడుస్తున్నారు.

నా ఏడుపును అతి కష్టం మీద అణుచుకుంటూ, "ఎలా జరిగింది?" అన్నాను.

"విధి వక్రించింది" అంటూ ఆయన కళ్ళు మూసుకున్నారు.

'ఈ వృద్ధాప్యంలో ఈ తండ్రికి ఎంతటి పుత్రశోకం...' విచారిస్తూ వుండిపోయాను.

ఇంతలో శేషు తల్లిగారు కాఫీ గ్లాసుతో వచ్చారు. ఐదు నిముషాల తర్వాత అందర్నించీ శలవు పుచ్చుకుని బైటకు నడిచాను. మిత్రుడితో వైజాగ్‌లో గడిపిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ గబగబా నడుస్తున్నాను.

ఇంతలో "ఏమండీ..!!" అనే పిలుపు. వెనక్కి తిరిగేను.

శేషు పెద్ద చెల్లెలు గాయత్రి. ఏడ్చి ఉబ్బినట్లు కళ్లు.

"ఏంటమ్మా" అన్నాను ఆమె వైపు చూస్తూ.

"మా అన్నయ్య చనిపోలేదు. బ్రతికుండగానే నాన్న తద్దినం పెట్టేసారు." అంది ఏడుపు ఆపుకుంటూ.

ఆమె మాటలకు ఆశ్చర్యపోతూ, అసలు "ఎందుకిలా జరిగింది?" అన్నాను.

"అన్నయ్య ఒక దళితుల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. నాకు, చెల్లికీ ఇక పెళ్లి కాదని నాన్న భయం. అందుకే ఊళ్లో అందరికీ కొడుకు చనిపోయాడని చెప్పి కర్మకాండ జరిపించాడు. పేపర్లోనూ వర్ధంతి ప్రకటన ఇచ్చాడు నాన్న."

ఆమె ఏడుస్తూ చెప్పిన ఆ మాటలు వింటూ నిర్లిప్తంగా వుండి పోయాను.

"అన్నయ్య అడ్రసు ఇది. ఉత్తరం రాయండి." అంటూ కాగితం అందించింది ఆమె.

ఇంతలో బస్సువచ్చింది. చనిపోయిన మిత్రుడు బ్రతికే వున్నాడనే నిజం నాలో ఆనందం కలిగించింది. మనసు ఉత్సాహంగా పరవళ్ళు తొక్కింది. ఆ సమయంలో శేషు తండ్రిగారు గుర్తొచ్చి.. 'ఇది అమాయకత్వమా, మూర్ఖత్వమా.... చెట్టంత ఎదిగిన కొడుకు బ్రతికుండగానే కర్మకాండ జరిపిస్తారా...!' అనిపించింది.

అంతలోనే మా నాన్న గుర్తొచ్చారు. మంజులతో నా పెళ్ళి విషయం లోనూ ఆయన అభిప్రాయం ఇంచుమించు ఇదేగా!

నాకు చెంప చెళ్ళుమనిపించినట్టయింది. విశాఖపట్నం వచ్చేవరకు నా ఆలోచనలు సాగుతూనే వున్నాయి.

* * *

బస్సు దిగి రూమ్ వైపు నడుస్తున్నాను. ఎదురుగా జన సందోహం. హక్కుల కోసం సోదరుల దండోరా... గబగబా ముందుకు నడిచాను. నాకు తెలిసిన కొన్ని ముఖాలు. నేను ఎదురుపడితే వారి కళ్ళ నించి జ్వాలలు ఎగిసిపడతాయి. నా కళ్ళు మాత్రం నవ్వుతున్నాయి. క్రమేపీ నా ముఖం నిండా నిర్మలమైన నవ్వు విస్తరించుకుంది. అది పెదాల మీదకు పాకింది. నా నవ్వు చూసి వాళ్ళూ నవ్వేరు. ప్రేమ పూర్వకమైన నవ్వు మా మధ్య. వారి చేతిలో వున్న డప్పు అందుకున్నాను. వాయించడం ప్రారంభించాను. అది మధురంగా వుంది. మృదు మంజుల నాదంలా....!

(రచన : అక్టోబర్ 2007)